# పాతివ్రత్యము

శ్రీమతి జటావల్లభుల బాలాత్రిపురసుందరిగారు

హిందువులకు మాత్రమే యుండి యితరులకులేని 'యుత్కృష్టధర్మములలో' పాతివ్రత్య ధర్మమొకటి. పాపకార్యము చేయకుండుటయే స్త్రీధర్మమని యితర మతములు చెప్పుచుండ, హిందూమతముపతియేసర్వమని భావించుటయే స్త్రీధర్మమని చెప్పుచున్నది.

హిందూ పాతివ్రత్య ధర్మమునందలి మఱియొక విశేషమేమన నది యీ జన్మలో మాత్రమేకాక మరణానంతమునకూడ నుండ తగినదనుటయే. ఒకవేళ పతిమరణానంతరమున సతి నీచవాంఛలకులోనై పాతివ్రత్యము కోల్పోవునేమోయను భయముతోనే మన శాస్త్రములు పతితోపాటు సతి మరణించుటయే మంచిదని చెప్పినవి. కాని యట్లు మరణింపకుండ వితంతువు భర్తయందలి భక్తినీడక బ్రహ్మచర్యముతో నుండునో నామె సహగమనము చేయకున్నను తప్పు లేదని శాస్త్రములు చెప్పుచున్నవి. సంతానహీనయైన వితంతువు మరదివలన సంతానము పొందవచ్చుననునది యితర యుగములలోని ధర్మము. అట్టిచో స్త్రీకి విషయవాంఛ యే మాత్రమును లేక భర్తృవంశమును నిలబెట్టవలెనను వాంఛయే యుండవలెను. ఈ కలి యుగములో నట్టి సందర్భమున కేవలము ధర్మబద్ధమైన వాంఛమాత్రమే కాక యితరమైనది కూడనుండి తీరునని భావించియే శాస్త్రకారులు ఈధర్మమును కలియుగములో నిషేధించినారు.

పాతివ్రత్యప్రభావ మెంతవఱకున్న దన దాని వలన సంతానహీనయైన వితంతువు పున్నామ నరకమునకు పోక స్వర్గమునకుపోవును. తాను స్వర్గమునకు పోవుటయేకాక భర్తకు కూడ స్వర్గప్రాప్తి గలిగించును.

పాతివ్రత్యధర్మము స్త్రీలబానిసత్వమునకు చిహ్నమని కొందరు తలచుచున్నారు. సాంఘికముగ కూడ పాతివ్రత్యము నాగరికతా లక్షణమేయని యాలోచించినవారికెల్ల తెలియగలదు. కుటుంబసౌఖ్యమున కది మూలాధారము. పురుషుడు కూడ ఆత్మార్పణము గావింపవలెనను ధర్మమొకటి యున్నది. అది పితృభక్తి మాతృభక్తి యను రూపములనున్నది. తల్లి తండ్రులెంత నికృష్టులైనను కుమారుడు వారిని భక్తితో సేవించుటయే ధర్మము. స్త్రీకి, భర్తపట్లగల ధర్మముకూడ నిట్టిదియే. భార్య యను హోదాలో నున్నప్పుడు స్త్రీ భర్తలోని దోషముల నెంచుట కెట్లధికారము లేదో యట్లే యామె తల్లిహోదాలో నున్నప్పుడు పుత్రు డామె దోషములనెంచుటకు వీలు లేదు. భార్య భర్తను బాగుచేయవలెనను నూహాతో నెవ్వరును దగ్గరలేనపుడు అతని లోని లోపములను అతనికి కన్పరచుచు మందలింపనైనను మందలింపవచ్చును కాని కుమారుడు తల్లినట్లు మందలించుటకుకూడ హక్కు లేదు. పాతివ్రత్య మాచరణములో నుండిన ప్రాచీనకాలములోనే యట్టి మాతృభక్తికూడ నాచరణములో నుండెడిది. కావున ఆకాలములో పాతివ్రత్యము స్త్రీలబానిసత్వమును సూచించునదని చెప్పుటకు వీలు లేదు.

బాలిక స్వయముగా కోరుకొనిన పురుషుని పట్ల పాతివ్రత్యము గన్పరుచుటయే యామె ధర్మముకాని తన యిచ్ఛను గైకొనకుండ తలిదండ్రులు కట్టిపెట్టినంత మాత్రమున నాతని పట్లభక్తిని కన్పరుపవలసిన బాధ్యత యాబాలిక కెందులకుండవలెనని కొందరు ప్రశ్నింతురు. ఆప్రశ్నకు సమాధానము మన గ్రంథములలోనే గన్పట్టుచున్నది. వివాహమునకు పూర్వము బాలికకు రక్షకుడు మార్గదర్శకుడుకూడ తండ్రియే. ఆతండ్రి తన్నొకనికిచ్చి ఈతనిని భక్తితో సేవింపుమని చెప్పినపిమ్మట నామె యట్లుచేయనిచో పితాజ్ఞాధిక్కారమగును. శర్యాతియను రాజు సుకన్యయను తన కుమార్తెను వృద్ధుడగు చ్యవనునకీయగా నొకనాడశ్వినీ దేవతలువచ్చి యామెను తమ్ము వివాహమాడగోరగా నామె నాతండ్రి నన్నువనికిచ్చినాడో నేనాతని వీడనని చెప్పినది. శ్రీరామచంద్రమూర్తి అరణ్యమునకు రావలదని తన్ను నివారించినపుడు సీతాదేవి నిన్నెన్నడును వీడవద్దని నాతండ్రి చెప్పినాడని చెప్పినది. శ్రీరామచంద్రమూర్తికూడ నొక సమయమున తన తండ్రిచే తన కంగీకరింపబడిన భార్యయగుటచే సీత తన కత్యంతప్రేమాస్పదురాలని చెప్పెను. కావున నితర విషయములలో వలెనే వివాహవిషయములలోకూడ బాలబాలికలు పితౄజ్ఞాపాలనము గావింపవలెనే గాని స్వాతంత్ర్యము వహించి తలిదండ్రులు కుదిర్చిన సంబంధమును త్రోసిరాజనకూడదనునదియే యార్యధర్మము.

భారతదేశములో చిరకాలము నుండి యాచరణమున నుండి కుటుంబసౌఖ్యమునకు మూలాధారమైన యీపాతివ్రత్యమునందలి ప్రాశస్త్యమును గ్రహించి నేటి నారీమణులందరు నీ యుత్కృష్ట ధర్మమును పునఃప్రతిష్ఠించుటకు ప్రయత్నించవలెను.

—:o:—

# ఆంధ్రమాత

పిశుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు

మధురము నీసుభాషితము
మాన్యము నీహృదయాశయంబు సు
ప్రథితము నీదువృత్తి నుతి
పాత్రము నీసుగుణవ్రజంబు స
త్పథికము నీయపత్యము న
పారము నీచరితంబు గాన ని
ష్పృథివిని నీకు సాటిగల
దే మఱియొక్కటి యాంధ్రమాతరో!

నీతి విహీనులచేతిలోఁ బడకుండ
నియమవ్రతంబున నిలిచినావు
దేశభాషలలోనఁ దెలుఁగులెస్సయటన్న
యభియుక్తబిరుదంబు నందినావు
సూర్యరాయనిఘంటు సూక్తిరత్నంబుల
గట్టిగా నొడిసింపఁ గట్టినావు
విశ్వవిద్యాలయ విఖ్యాతవృత్తినిఁ
గడుపాఱఁగని ఖ్యాతి వడసినావు
ఆంధ్రసాహిత్య పరిషదాహ్వయతనూజ
చేయు శుశ్రూషలకును హర్షించినావు
ఇంక నెన్నెన్ని విధముల నేనయఁగలవొ
యరయనలవియె నీగాథ యాంధ్రమాత!